Assemblies Of The Living Elohim (1. Tim 3:15) India presents............ యావె మహోన్నతుడు భయంకరుడు, ఆయన సర్వభూమికి రాజై యున్నాడు

Satyamunakai Poratam REGD. No. 67970 / 97

# సత్యమునకై పోరాటం

Regd. Monthly Newspaper
Postal Regd. No. H/APM/01/2009-2011
Valid upto 12/2011
Posted on 30th of Every Month
Annual Subscription Rs. 50/-
To :

Editor & Publisher :
Bro. I$aac E. Kusuma
Malikipuram - 533 253
E.G. Dist. (A.P.) India.

Website : www.aotle-india.org
E-mail : satyamunakaiporatam@gmail.com
Office : Ph : 98493 85038

VOLUME : 13 ELUL-TISHREI 5770 (AUGUST 2010) PAGES:4 ISSUE 146

హెచ్చరిక:- ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు

# మధ్యవర్తులు

MEDIATORS

– బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ

- అది (ధర్మశాస్త్రము) మధ్యవర్తి చేత యావె దూతల ద్వారా నియమింపబడెను ........................గలతీ 3:19
- ఎలోహీం ఒక్కడే, ఎలోహీంనకు, నరులకును మధ్యవర్తియు ఒక్కడే, ఆయన మెస్సీయ యషువను నరుడు. 1తిమోతి 2:5
- మధ్యవర్తి యొకనికి మధ్యవర్తికాడు గాని ఎలోహీం ఒక్కడే ..............................................గలతీ 3:20

*అటులనే ఈ వాక్యములు చదవండి. ...................................................... హెబ్రీ 8:6, 9:15, 12:24*

- ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను......................................................యోహాను 1:17

బైబిలు పరంగా మొట్టమొదటి మధ్యవర్తి ఎవరు? అని బైబిల్ కాలేజీలో అడిగితే స్టూడెంట్స్ అందరూ మోషే అన్నారు. నేనైతే సాతాను అన్నాను. అంతే: టీచర్లకు సమస్య ఏర్పడింది. మధ్యవర్తి అంటే ఇద్దరి వ్యక్తుల మధ్య దూరే మూడవ వ్యక్తి, లేక రెండు పార్టీల మధ్య శత్రుత్వం/సమాధానం నడిపే మూడవ పార్టీ.

ఆదిలో పరమతండ్రియైన యావె ఆదామును హవ్వను సృజించిన తరువాత వారికిని – పరమతండ్రియైన యావెకును మధ్యవర్తి/మధ్యవర్తులు లేరు. కొంతకాలం అయ్యాక యుక్తిగలదైన సర్పము మధ్యవర్తిగా వ్యవహరించి పరమతండ్రికిని –ఆదాము హవ్వలకును ఉన్న మంచి బంధమును తెంపివేసింది, సంబంధమును దూరం చేసేసింది, ముఖాముఖి బంధమును సర్వనాశనం చేసింది. ఆ మధ్యవర్తి చెప్పిన అన్ని మాటలు అబద్దములే గాని ఒక్క నిజమైన మాటలేదు. అన్నిమాటలు ఎంతో నిజమైన వాటిగా చెప్పి నమ్మించిందే గాని, క్రియాపూర్వకంగా వచ్చేసరికి ఏదీ వాళ్ళకు దొరకలేదు. సిగ్గుతో నింపి చెట్లచాటుకు నడిపించిందేగాని ముఖాముఖిగా పరమతండ్రి వద్దకు నడిపించలేకపోయింది. పరమతండ్రిపై పూర్తిగా నమ్మకం లేకుండా చేసిపారేసింది. పరమతండ్రిమాటపై అపనమ్మకం ఏర్పరచింది, తన మాటను నమ్మేట్టుగా చేసుకుంది. అలాగని ఆ సర్పము ద్వారా వారు ఏ మేలును పొందలేక పోయారు. పైగా ఘోరమైన కీడును నెత్తిమీదికి తెచ్చుకున్నారు. ఏదో ఊహాలోకంలోకి పోయి ఏవేమో ఊహించుకుని అగాధంలోకి పడద్రోయబడినారు. ఎలా మోసపోయారో అర్థం అయ్యేసరికి అధోగతి పాలయ్యారు. అయినా కృపగల పరమతండ్రి, వారి అజ్ఞానాన్ని మన్నించి, వారికి వేరొక మార్గమును ఏర్పాటు చేసాడు. తనమాట వినలేదనిగాని, తనను నమ్మలేదనిగాని, పగ ప్రతీకారం తీర్చుకోకుండా తన ప్రేమను వ్యక్తపరిచి వారిని రక్షించాడు. మన మూలపితరులైన ఆదాము, హవ్వలను మోసపరచిన మధ్యవర్తి (సాతానుడు) ఇప్పుడు మన మధ్యలోనే ఉన్నాడు. వాడు ఎలా మధ్యవర్తిత్వం చేస్తూ మనలను పరమతండ్రికి దూరం చేస్తున్నాడో తెలుసుకోగలిగితే చాలా మంచిది. పరమతండ్రికి–భక్తులకు మధ్యవర్తులు అవసరం లేదు. కాని అలా మధ్యవర్తులు కావాలి అని అడిగిన వారు యూదులు. ఈ వాక్యములు చదవండి. నిర్గమ 20:18–20, ద్వితీ 5:25–30, 18:15,16 పిరికి యూదులు, మాటిమాటికి తప్పుడు పనులు చేయడాన్ని అలవాటుపడిన యూదులు, పరమతండ్రి మాటకు భయపడిపోయి నిర్గమ 20:18,19 మధ్యవర్తిని (మోషేను) కోరుకున్నారు. అప్పటినుండే పరమతండ్రికి–మనుష్యునికి మధ్య మధ్యవర్తులు (ప్రవక్తలు, యాజకులు మొ॥గువారు) వచ్చారు. వాస్తవానికి పరమతండ్రి మాటలు వినినవారుగాని, లేక ఆయన మహాత్యము చూసినవారు గాని చావలేదు. ద్వితి 5:23,24

- పరమతండ్రియైన యావె మాటలు విని, లేక ఆయనను చూచి ఆదాము హవ్వలు చనిపోయారా?
- కయీను ఆయనకు గర్వంగా సమాధానం చెప్పి చనిపోయాడా?
- అబ్రహాముతో ఆయన మాట్లాడలేదా? అబ్రహాము చనిపోయాడా?
- నోవాహుతో ఆయన మాట్లాడలేదా? నోవాహు చనిపోయాడా?
- ఇస్సాకుతో ఆయన మాట్లాడలేదా? ఇస్సాకు చనిపోయాడా?
- యాకోబు ఆయనతో పెనుగులాడలేదా? యాకోబు చనిపోయాడా?
- యోసేపుతో ఆయన కలల ద్వారా, దర్శనముల ద్వారా మాట్లాడలేదా? యోసేపు చనిపోయాడా?
- మోషేతో హోరేబులో ఆయన మాట్లాడలేదా? మోషే చనిపోయాడా?

పరమతండ్రిని డైరక్టుగా సమీపించలేని నీతిలేని జనాంగం భయపడిపోయి, వణికిపోయి, కంగారైపోయి, మధ్యవర్తులను ఎన్నుకున్నారు. నిర్గమ 19:16,20:19, ద్వితీ 5:25,26: సరే, ఎన్నుకున్న మధ్యవర్తుల మాటలు అయినా విన్నారా? అదీలేదే! మధ్యవర్తులు లేకుండా పరమతండ్రి మనుష్యులకు కనబడడా? లేక మాటలాడడా? అలా అయితే, మోషేకు–పరమతండ్రికి మధ్యవర్తి ఎవరు? అబ్రహాముకు–పరమతండ్రికి మధ్యవర్తి ఎవరు? నోవాహుకు–పరమతండ్రికి మధ్యవర్తి ఎవరు? ఇది మన విశ్వాసము మీద ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తిని మనము ఖచ్చితముగా నమ్మినపుడు, ఆ వ్యక్తికీ–మనకీ మధ్యవర్తి అవసరమా? మధ్యవర్తి యొక్క ఆవసరత ఎప్పుడు వస్తుంది? ఇశ్రాయేలీయులకి ఎప్పుడు వచ్చింది? ఎందుకు వచ్చింది? ఆలోచించండి.

–అయ్యబాబోయ్; నీవు మాట్లాడితే నేను చచ్చిపోతానేమో అని మోషే గాని, అబ్రహాము గాని, నోవాహు గాని, ఇస్సాకు గాని, యాకోబు గాని, మరే ఇతర భక్తులు అనలేదే! ఈ భక్తులే (ఇశ్రాయేలీయులే) అనడాన్కి గల కారణం ఏమిటి? ఇశ్రాయేలీయుల ప్రధానులు ఎలోహీంని చూడలేదా? వారు ఎలోహీంని చూసి అన్నపానములు పుచ్చుకోలేదా? నిర్గమ 24:11. ఆరు లక్షల కాల్బలమైన ఇశ్రాయేలీయులను నడిపించడాన్కి వచ్చిన యెహోషువకి–పరమతండ్రికి మధ్య ఉన్న మధ్యవర్తి ఎవరు? న్యాయాధిపతుల గ్రంథంలో వ్రాయబడిన న్యాయాధిపతులకు–రక్షకులకు–విమోచకులకు–పరమతండ్రికి మధ్యగల మధ్యవర్తులెవరు? ఎందుకు మధ్యవర్తుల అవసరత ఇశ్రాయేలీయులకు ఏర్పడింది?

సమూయేలుకి–పరమతండ్రికి మధ్యవర్తి ఎవరు? అటులనే ఏలీకి, దావీదుకి, ప్రవక్తలు మొ॥గు వారికిని పరమతండ్రికిని మధ్యవర్తులు ఎవరు? యోబుకి–పరమతండ్రికి మధ్యవర్తి ఉన్నాడా? చదవండి ఈ వాక్యం యోబు 9:32,33. ఇదే విషయం క్రొత్త నిబంధనలోనికి వస్తే అపోస్తలుడైన సౌలు చెప్తున్నాడు. గలతీ 1:11,12,15–20, 2:5–10. పరమతండ్రితో డైరక్టు కాంటాక్ట్ కలిగి ఉన్నాడు. అపోస్తలుడైన సౌలుకి–పరమతండ్రికి మధ్య మధ్యవర్తులు లేరు. అందుకే అపోస్తలుడైన సౌలు **"నేను నమ్మిన వానిని ఎరుగుదును"** అని ఖండితంగా చెప్పగలిగాడు. (మధ్యవర్తులు లేకుండా పరమతండ్రిని చేరలేమా? అంటే చేరగలము, చేరలేము. కొన్ని విషయాలకు మాత్రమే మధ్యవర్తులు అవసరం గాని అన్ని విషయాలకు అవసరం లేదు. ఉదా:అననీయ అపోస్తలుడైన సౌలుకి బాప్తిస్మం యివ్వడాన్కి అవసరమయ్యాడు.)

అసలు మధ్యవర్తులు ఎవరికి కావాలి?

- ఖచ్చితంగా నమ్మలేని వారికి.................................................... ఆది 3:1–3
- మోసపోతున్నానేమో అనే అనుమానం గల వార్కి................................ ఆది 3:5
- ఉన్నతమైన స్తితికి పోవాలనుకునేవారికి ........................................ ఆది 3:6
- చెడునడవడి గల వారికి..................................................సామెతలు 17:4
- కొండెములు వినేవారికి ................................................ సామెతలు 18:8
- సత్యమును నమ్మని వారికి ............................................ 1రాజులు 13:18
- అబద్దాలు వినడంలో అభిలాషగల వార్కి ..........................2థెస్స 2:11,12
- జ్ఞానము లేని వార్కి .......................................................సామెతలు 14:15
- నమ్మరు, నమ్ముతారు అనే ద్విమనస్కులకు ............................ లూకా 24:24
- మనుష్యుల ఆంతర్యం తెలియని వారికి ................................యోహాను 2:24
- మాట మీద నమ్మకం లేని వార్కి ................................................
- పూర్తిగా నమ్మలేని వార్కి...........................................................

కావాలి మధ్యవర్తులు. నీతిగా, నిజాయితీగా ఉండే వారెవరైనా ఏవిషయాన్నైనా ముఖాముఖిగానే తేల్చుకుంటారు. స్నేహం చేసినా, ప్రేమించినా, భక్తి చేసినా, మరే విషయమైనా ముఖాముఖిగా మాట్లాడుకోవడమే మంచిది. మధ్యవర్తులు అనేకమైనసార్లు కీడుకే గాని మేలుకి పనికిరారు. మధ్యవర్తుల ద్వారా మోసపోయిన భక్తులు, వ్యాపారస్తులు, ప్రేమికులు, భర్త–భార్యలు, స్నేహితులు, కుటుంబీకులు ఎందరో కలరు. మోసపోయిన తరువాత గొల్లుమంటూ ఏడ్చిన ఎన్నో సంసార జీవితాలు కలవు.

యషువ మెస్సీయ మత్తయి 6:6లో ఒక మాట చెప్పాడు. డైరక్టుగా పరమతండ్రికే మనం ప్రార్థన చేసుకోవచ్చు ముందు సహవాసం చేయవలసింది పరమతండ్రితో (1యోహాను 1:3) తరువాత సమాజంతో సహవాసం చెయ్యాలి. (హెబ్రీ10:24, 1కొరింథి 14:26–40) అక్రమస్తులు ఉన్నచోట కీడుకే గాని ( 1కొరింథి 11:17,18) మంచికి తావు ఉండదు. యషువ మెస్సీయ శిష్యులు పిల్లలను యషువ నొద్దకు వెళ్ళకుండా అడ్డుకున్నారు. యషువ మెస్సీయ శిష్యులు వేరొకరిని బోధించకుండా చూడాలని చూసారు (మార్కు 9:38–40) అపోస్తలుడైన సౌలును అపోస్తలుడే కాదన్నారు. ( 1కొరింథి 9:1) యషువను మెస్సీయ కాదని మూర్ఖులైన యూదులు అన్నారు. గనుక మధ్యవర్తులంటే ఇలాగ ఉంటారు. మధ్యవర్తుల ద్వారా కాకుండా యావెను రుచి చూచి తెలుసుకొనుట మంచిది. కొన్ని వేల డినామినేషన్లు/ మిషన్లు/ సంఘాలు/ సంస్థలు పరమతండ్రికి మనకి మధ్యవర్తులుగా నిలబడుతున్నారు. కొంతమంది వ్యక్తులైతే వారే మనుష్యులకు ఎలోహీంకి మధ్యవర్తులన్నట్లు మోసగిస్తున్నారు, నటిస్తున్నారు. ఈ విషయం కూడా యషువ మెస్సీయ మత్తయి 23వ అధ్యాయంలో చెప్పాడు. అందుకే ఆయన ఈ భూమిమీద బోధించినపుడు – నేనే మార్గము నేనే సత్యము నేనే జీవము నా యొద్దకు రండి అని చెప్పాడే గాని, ఫలానా డినామినేషన్ ద్వారా అనిగాని/ఫలానా మిషను ద్వారా అనిగాని/ఫలానా వ్యక్తి ద్వారా అని గాని రమ్మని చెప్పలేదు. గనుక విశ్వాసులు దీనిని గ్రహించాలి. డినామినేషన్లతో/మిషనులతో/గ్రూపులతో/వ్యక్తులతో పరమతండ్రిని చేరుట కష్టము. గనుక వ్యక్తులు ముఖ్యంగా విశ్వాసులు స్వతంత్రులై యుండాలి. బానిసలు పరలోకరాజ్య వారసులు కారు.

2వపేజీలో

## యావె కొరకే ఎదురు చూస్తాను

మీకా 7:7, హబక్కూకు 3:17–19

**పల్లవి:** ఎవరెవరి కొరకు ఎవరెదురు చూసినా,
నీ కొరకే నే నెదురు చూచెదన్

**అ॥ప:** నాకున్న ఏకైక/ఆఖరి నిరీక్షణ నీవు
నీవు గాకెవ్వరు నాకున్నారు?
నీవే నా జీవిత గమ్యం ॥ఎవరెవరి॥

1. ఎన్నెన్నో శోధనలు ఎదురైన గాని
అన్నిటిలోన జయమిచ్చావు
అందరిలోన హెచ్చుగా నిలిపి
నన్ను నీవు నిలబెట్టావు ॥నాకున్న॥

2. ఎన్నెన్నో ఆశలు ఎరగా నిలిచినా
నాకున్న ఆశ నీవు మాతమే
దురాశలేదు - నిరాశ లేదు
ఆశావాదినే - నేనెల్లప్పుడు ॥నాకున్న॥

3. ఎన్నెన్నో అందాలు బంధించాలనుకున్నా
నీ బంధమే నన్ను బందించింది
నాకంటూ ఒక స్థానం ఏర్పరిచావు
నన్ను నీలో చెక్కుకున్నావు ॥నాకున్న॥

4. దప్పిగల నాకు సేద తీర్చావు
తప్పు చేయకుండా ఆపుతున్నావు
నీవానిగనే నేను మిగిలిపోతాను
నీకొరకే నే జీవిస్తాను ॥నాకున్న॥

– బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ

డినామినేషన్ బోర్డు కట్టుకున్న వారెవ్వరు పరలోకం వెళ్ళరు. డినామినేషన్లు/మిషన్లు/సంఘాలు/సంస్థలు/ప్రత్యేక వ్యక్తి పూజలకు అలవాటు పడిన వ్యక్తులు పరలోకం తీసుకువెళ్లరు. "నా" అనే మాట యషువ మెస్సీయ ఎన్నిసార్లు చెప్పాడో మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలలో చదివితే మీకే తెలుస్తుంది. నాయొద్దకు రండి, నా మాటలు వినండి, నా కాడి ఎత్తుకోండి, నా నామమున అడగండి, నన్ను నమ్మండి, నాదగ్గర నేర్చుకోండి, అని అన్నాడే గాని.....వాళ్ళ ద్వారా నా దగ్గరకు రండి అని అనలేదు. ముందు యషువ మెస్సీయను మీరు జాగ్రత్తగా వెతికి ఆయన వద్ద బోధ నేర్చుకుంటే ఎవరికైనా బోధించగలరు, ఎక్కడైనా నిలబడగలరు. అది అందరూ ముందు నేర్చుకోవాలి. అప్పుడు మధ్యవర్తుల ద్వారా మోసపోరు. ఎన్ని డినామినేషన్లు (ఎందరు మధ్యవర్తులు) ఉన్నా మోసపోయే అవకాశమే ఉండదు.

స్నేహానికైనా, ప్రేమకైనా, బంధుత్వానికైనా, లేక ఏ బంధానికైనా, బాంధవ్యానికైనా "నమ్మకము" అనేది ముఖ్యము. అయితే "నమ్మకము" ఎక్కడుందో మోసము కూడా అక్కడే ఉంది. గనుక మనిషికి ఒక కట్టుబాటు (ధర్మము) ఉండాలి. దానినే చాలా మంది ప్రిన్సిపల్స్ అంటారు. ప్రతిమనిషికి వ్యక్తిత్వం ఉండాలి. మాటకు నిలబడడం, ప్రమాణం చేస్తే నష్టం కలిగినా తప్పకుండా ఉండడం, అత్యవసరమై ప్రాణం పోయే సమస్య వచ్చినా నీతికి నిలబడడం అనేది మానవులు నేర్చుకోవాలి. ఎందుకంటే మానవుడ్ని సృష్టించిన సృష్టికర్త మానవుడ్ని యదార్ధవంతుడిగా సృష్టించాడు (ప్రసంగి 7:29) ఆ యధార్ధత మానవుడు నిలబెట్టుకోవాలి. ఎందుకంటే మానవ జీవితం చాలా చిన్నది. (కీర్తనలు 39:4-6, 90:10) ఒక మోసగాడిగా, దొంగగా, పరమతండ్రిబిడ్డలు ఉండకూడదు. ఒక వేళ ఏదైనా పొరపాటు జరిగితే, దానిని అత్యవసరమైతే బహిరంగంగా ఒప్పుకొని, దాని విషయమై క్షమాపణ కోరడం మంచిది. తప్పు చేసి కవర్ చేసుకోవడం లేదా వాక్యాన్ని అడ్డుపెట్టుకొని కవర్ చేసుకోవడం చాలా ప్రమాదకరమైన విషయం అని గుర్తుంచుకోవాలి. వాక్యాన్ని అడ్డుపెట్టుకొని గాని నేరమును ఎదుటివారిపై మోపిగాని, లేక వేరే ఏ విధమైన మార్గమును ఎంచుకొని తప్పుని కవర్ చేసుకోవడానికి ప్రయత్నించినా (2సమూ 11:14-25, న్యాయాధి 9:46-56) దానికి తగిన శిక్ష మాత్రం పరమతండ్రి నుండి పొందక మానరు (2సమూ 12:7-15) భక్తులెవరూ పాపమును కప్పుకోలేదు గాని ఒప్పుకుని పశ్చాత్తాపపడి దానినుండి ప్రాయశ్చిత్తం పొందారు.

- దావీదు మహారాజు తన పాపమును/తప్పును అంగీకరించాడు ......2సమూ 12:12,24:17
- సౌలు రాజు తన తప్పును ఒప్పుకున్నాడు
- హిజ్కియా స్థిరపడి గర్వపడి మరళా పశ్చాత్తాపపడ్డాడు

-అటులనే అనేక మంది నీతిమంతులైన భక్తులు పొరపాట్లు చేసి, గద్దించబడి, తగ్గించుకొని తండ్రి కృపను పొందుకున్నారు. స్వయంకృతాపరాధములు ఏమైనా చేస్తే, వాటికి తగిన శిక్ష అనుభవించి తండ్రితో ఐక్యమయ్యేవారు. ఎందుకంటే శరీరం కలిగిన ఏ మనుష్యుడూ మంచిని చేయాలనుకుంటాడే గాని చేయలేడు. బైబిలు ధర్మము ఒక ప్రక్కన మనిషికి తప్పు-ఒప్పులు చూపిస్తున్నా ఎక్కువగా తప్పుకే మనిషి మొగ్గుతాడు తప్ప మంచికి మొగ్గలేడట: ఎందుకంటే వేరొక నియమము ప్రతీ మనిషి శరీరంలోనూ ఉంది. చదవండి. రోమా 7:18-25, అపోస్తలుడైన సౌలు సహితం ఏమంటున్నారో చదవండి, ఫిలిప్పీ 3:13-16, నేను/మేము చాలా పెర్‌ఫెక్ట్ అని ఎవ్వరూ చెప్పలేరు, చెప్పజాలరు. ఎందుకంటే పరిపూర్ణమైన మార్గములో మనము ప్రయాణం చేయుచున్నామే గాని ఇంకనూ దానిని సాధించలేదు. లేదా ముగించలేదు. యవ్వన పురుషులైనా, యవ్వనస్త్రీలైనా జారత్వం/వ్యభిచారం చేయకపోవచ్చును గాని వారి ఆలోచనలు మాత్రం చెడుగానే ఉంటాయి. ఈ హృదయాలోచనలు మనిషికి తెలియక పోవచ్చును గాని అవి పరమతండ్రికి తెలుస్తాయి. రహస్యపాపములు, మానసిక వ్యభిచారములు, తప్పుడు ఆలోచనలు అవి ప్రతీ మనిషని ఏలుతూనే ఉంటాయి. ఎంత గొప్ప భక్తులైనా అబద్ధాలను చాలా తేలికగా నమ్ముతారు. లోకస్తులకన్నా నీచంగా చెడు ప్రచారం చేస్తూ ఉంటారు. వాళ్ళ యిళ్ళల్లో జరిగే చెడుగూర్చి కప్పి పెట్టేసుకుని ఎదుటి వాళ్ళకు మాత్రం చెడు చేస్తూ ఉండే సంస్కృతి మనది. వాస్తవానికి నిజం తెలియకపోయినా, అబద్ధాలను, చెడును మాత్రం చాలా వేగంగా ప్రచారం చేస్తారు. అది మానవనైజం, దయ్యపుబుద్ధి. ఇది భక్తిహీనులలో కన్నా భక్తులం అనేవాళ్ళలోనే ఎక్కువగా ఉంది. ఇక మధ్యవర్తులుగా వ్యవహరించే వారిని జాగ్రత్తగా పరిశీలిస్తే: వీళ్ళు లింక్ ఎక్స్‌ప్రెస్ కన్నా చాలా వేగంగా ప్రయాణిస్తూ ఉంటారు. ఎందరో ప్రేమికులు, స్నేహితులు, భర్త-బార్యలు, తల్లిదండ్రులు-పిల్లలు, అన్నదమ్ములు-అక్కచెల్లెండ్రు, కుటుంబాలు విడిపోవడాన్కి గల కారణం మధ్యవర్తులే. అనేక మంది మంచి భక్తులకు సత్యం తెలియక పోవడాన్కి గల కారణం కూడా ఈ మధ్యవర్తులే (డినామినేషన్లే/మిషన్లే). ఎవరైనా ఒక వ్యక్తిమీద మంచి అభిప్రాయం మనకు లేకపోతే, ఆ వ్యక్తిపై ఎలాంటి అబద్దాలు, నిందలు వేసి మాట్లాడుతున్నా మనం నమ్ముతాం. అది సాతాను అని గ్రహించం. మన చెవులు మంచివి కావు. చెడువినడానికి అలవాటు పడినంత తొందరగా/సులువుగా మంచిని వినడాన్కి మన చెవులు సహకరించవు. కళ్ళతో చూడరాని/ చూడలేనిది కనిపించినపుడు వెంటనే కళ్ళు మూసేసుకుంటాము. నోటికి సరియైన రుచి కానిది తగలగానే ఊసేస్థాము. కాని చెవులకు వినరానిది వినపడగానే వినకుండా ఉండలేరు కాని చెవులు నిక్కబొడుచుకుని మరీ వింటారు. భక్తిహీనులే కాదు భక్తులనబడిన వారూ ఈ విషయంలో అంతే: **చెడునడవడి గలవారు దోషపు మాటలు వినును. నాలుక హానికరమైన మాటలు పలుకుచుండగా అబద్ధికుడు చెవియొగ్గి వినును సామెతలు 17:4.** కళ్ళతో చూసి మోసపోయే భక్తులు కొందరైతే (ఆది 3:6,7,37:31-35, 39:10-20, 2సమూ 13:6,7+21) చెవులతో చెడు విని మోసపోయే భక్తులు మరికొందరు. ఈ పరమభక్తులకు పరిశుద్ధాత్మ గాని సత్యస్వరూపియైన ఆత్మగాని ఉండదు. అందుకే అబద్దాలను నిజమని నమ్ముతారు, **నిజాన్ని అబద్ధమని నమ్ముతారు. మాటలను పరీక్షించుకునే యంత్రము (యోబు 12:11)** వీళ్ళకు ఉండదు. నిజాన్ని నమ్మలేని వార్కి అబద్ధాన్ని నమ్మే గొప్పవరం పరమతండ్రే వాళ్ళకు యిచ్చాడు, ఇస్తాడు 2 థెస్స2:11,12, 2రాజులు 22:23, వేషదారణకు మోసపోయే పరిశుద్ధాత్మపూర్ణులు కూడా బైబిల్లోనే ఉన్నారు (గలతీ 2:13, అ॥కార్య 11:22-24) మన మధ్యలో ఉండడం పెద్ద గొప్పేమిటి? తండ్రి ఆత్మ ఉన్నవాడు శారీరకంగా గుడ్డి వాడైనా ఖచ్చితంగా కనిపెట్టగలుగుతాడు (1రాజులు 14:1-6) పరిశుద్ధాత్మ కలిగినవాడు అబద్ధమును చాలా తేలికగా పసికట్టగలుగుతాడు (అ॥కార్య 5:3+8) ఆత్మలేనివాడు (జ్ఞానము లేనివారు, వివేకము లేనివారు) ప్రతీమాట నమ్ముతాడు. ప్రేమించేవారెవరైనా దోషపు మాటలు వినరు.సామెతలు 10:12, దోషపు మాటలు వినేవారు ప్రేమించలేరు.సామెతలు 17:9. కాని ప్రేమించినట్లు నటిస్తారు. నటన ఎప్పటికైనా ప్రమాదమే. నిజమనేది ఎప్పుడూ శాశ్వతమే. శాశ్వతమైన ప్రేమతో యషువ మెస్సీయ మనలను ప్రేమిస్తున్నాడే గాని మనలా నటిస్తూ ప్రేమించడంలేదు. యషువ మెస్సీయ నామములో ఉన్న వాళ్ళు యషువ మెస్సీయలాగే ప్రేమించాలి గాని సాతానుగాడిలా నటించకూడదు. నటనతో పవిత్రమైన ప్రేమను ఎక్స్‌పోజ్ చెయ్యకూడదు. అవసరం తీరిపోయాక ద్వేషించడకూడదు. అది ప్రేమ అనే పదానికే అసహ్యం. 2 సమూ 13:1-22, అందుకే ప్రేమను నటించే వాళ్ళు మధ్యలోనే చస్తారు, లేదా చంపబడతారు. మోసగాళ్ళు ప్రేమికులు అవ్వరు. అవకాశవాదులు కూడా ప్రేమికులు అవ్వరు.

ప్రేమించే వారెవరైనా ఎదుటి వార్కి లేక ప్రేమించిన వార్కి మేలు చేస్తారే గాని కీడు తలపెట్టరు (1సమూ 18:1-4) ఒక వేళ ఎవరైనా మనం ప్రేమించిన వ్యక్తికి కీడు తలపెడుతుంటే, ఆ కీడు నుండి తప్పించడాన్కి ప్రయత్నించాలి. అది నిజమైన ప్రేమికుల లక్షణం. 1 సమూ 20:2-42 దావీదు యావె యద్ధములు చేయువాడు గనుక, యోనాతానుకు అది తెలుసు గనుక దావీదుకి **తన** దుప్పటి, **తన** కత్తి, **తన** విల్లును నడికట్టును తీసి యిచ్చాడు. (1సమూ 18:3,4) యోనాతాను దావీదును ప్రేమించిన విధానము చాలా గొప్పది. అందుకే యోనాతాను చనిపోయినపుడు దావీదు అతనిని గూర్చి అంగలార్చిన అంగలార్పు చాలా బాధకరమైనది 2సమూ 1:26. నిజమైన స్నేహితులు/ప్రేమికులు ఇలా ఉంటారు. తెలుసు, తెలుసు అంటూనే ఏమీ తెలియనివారు స్నేహితులుగా ఉండలేరు.మేలు పొంది అడ్డం తిరిగే నాబాలులు (1సమూ 25:2-44) ఎంతో మంది ఉన్నారు. ఏదైనా ఒక శోధన మనిషికి ఎదురైనప్పుడు, అంతవరకూ స్నేహంగా ఉండి శత్రుపక్షమున చేరు అవకాశవాదులు (2సమూ 17:1-4) కూడా ఉంటారు. మనతో నడుస్తూనే మనకు గోతులు త్రవ్వేవారుంటారు (కీర్తనలు 55:12-14), నమ్మించి మోసం చెయ్యాలని చూసే వారుంటారు (మత్తయి 26:14-16) ఏదో మేలు చేస్తున్నట్లుగా కనిపిస్తూ మోసంలో ముంచే వారుంటారు (నెహెమ్యా 6:10-14) పడిపోతే పల్లు యికిలించాలని చూసే గొప్ప స్నేహితులుంటారు (యిర్మియా 20:10) నిజానిజాలు ఎమిటో తెల్సుకోకుండానే ఉద్రేకపడిపోయి రాళ్ళురువ్వి దుమ్ము ఎగరవేసే షిమీగాళ్ళు ఉంటారు (2సమూ 16:5-13,19:16-23). ప్రేమను చంపుకొని ఒకరిని ఒకరు అప్పగించుకునే వారుంటారు మత్తయి 24:10. ఇలాంటి వాళ్ళందరూ సరియైన మనస్తత్వం కలిగిన వారు కారు, అస్థిరులు, సాతానుకు లోబడిపోయినవారు. పరమతండ్రి ఆత్మ ఉన్నవారు వీరిని చాలా సులభంగా గుర్తిస్తారు. గనుక తండ్రి సంబంధులు దేనికీ కంగారుపడరు, భయపడరు, స్థిరంగా ఉంటారు. నిజాన్ని చూడగల కన్నులు (ద్వితీ 29:4) అబద్ధమును పసిగట్టగల ఆత్మ అ॥కార్య 5:3,8,9 పరమతండ్రి యిచ్చే గొప్పవరం. ఇవి భక్తులలోనే చాలా వరకూ కానరావు. లోకులు ఆలోచించినట్లే, లోకులు తలంచినట్లే, లోకుటు ఊహించినట్లే భక్తులు ఊహించుట చాలా విచారకరం. అప్పుడు భక్తుడికీ లోకస్తుడికీ తేడా ఏముంది? - భక్తి అనేది ఈలోకానికి వ్యతిరేకమైనది. లోకాత్మకు సంబంధం లేనిది. భక్తి పరసంబంధమైనది. పరలోకసంబంధులు పరలోక సంబంధుల్లా ఆలోచించాలి. లోకుల్లా ఊహించకూడదు, ఆలోచించకూడదు. పరలోకసంబంధులు ప్రార్ధనచేసి తెల్సుకోవాలి. పరమతండ్రి యొద్ద ఆలోచనచేసి మర్మమైన విషయాలు తెలియపర్చాలి. అట్లు కానియెడల వాళ్ళ చేసేది భక్తి అవ్వదు, వారు భక్తులు అవ్వరు. నిజమైన భక్తునికి **"మధ్యవర్తులు"** అవసరత ఉండదు. ఇద్దరూ సత్యసంబంధులే అయితే మధ్యవర్తి అవసరత ఎందుకుంటుంది? ఇద్దరూ ఒక్కటే అయితే మధ్యవర్తులు ఎక్కడుంటారు? అందుకే భక్తుడైన యోబు **"మా యిద్దరి మీద చెయ్యి ఉంచదగిన మధ్యవర్తి మాకు లేదు"** (యోబు 9:33) అని అన్నాడు. అది సత్యసంబంధుల బంధం. మరి మీది ఎలాంటి బంధం? ఎలాంటి ప్రేమ? ఎలాంటి స్నేహం? మీరే ఆలోచించుకోండి...

# నీతినిమిత్తం హింసింపబడువారు ధన్యులు

-బ్రదర్ ఐజిక్ ఇ. కుసుమ

- నీతి నిమిత్తం హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది — మత్తయి 5:10
- అనేక శ్రమలను అనుభవించి మనము ఎలోహీం రాజ్యములో ప్రవేశింపవలెననియు వారిని హెచ్చరించిరి — అ॥కార్య 14:22
- ఆ కాలమందు మెస్సీయ మార్గమును గూర్చి చాలా అల్లరి కలిగెను — అ॥కార్య 19:22

హింస-శ్రమ-అల్లరి మొ॥నవి పరమతండ్రి బిడ్డలకు సహజము. అవి ప్రతీ మనిషి జీవితంలోను జరగవలసినవే. తండ్రినామములో ఉన్నవారు కూడా వీటి గుండా వెళ్ళవలసిందే. ఎక్కడైతే పరమతండ్రి కొరకు ఎవరైతే నిలబడతారో వాళ్ళకు తప్పనిసరిగా శ్రమ-హింస-అల్లరి కలగకమానదు.

యషువ మెస్సీయ పుట్టడాన్కి ఒక కన్య అవసరమైంది. పరమతండ్రియైన యావె మరియను ఎన్నుకున్నాడు. మరియ అనుభవించిన నిందలు, బాధలు ఎన్నెన్నో మీకు తెలుసా? అదేమైనా చిన్న విషయమా? పరిశుద్ధాత్మ ద్వారా గర్భవతి అవ్వడం అంటే లోకం నమ్మేదా? యూదులు నమ్మారా? ఆమె భర్త దానికి అంగీకరించాడా? ఎన్ని శ్రమలు ఆమె అనుభవించింది? ఆమె స్థానంలో మీరు నిలబడి ఆలోచించండి. తండ్రి చిత్తం ఎలా వుందో మనుష్యుల తీరు, తీర్పు ఎలావుందో మీకే తెలుస్తుంది మత్తయి 1:18,19, లూకా 1:26-38, 2:4-39. యషువ మెస్సీయ కడుపులో పడిన దగ్గర నుండి ఆమె మోసిన నిందలు, శ్రమలు, బాధలు ఎన్నో ఆమె స్థానంలో ఉండి ఆలోచిస్తే తెలుస్తుంది. భర్త రహస్యంగా వదిలెయ్యాలని చూసాడు (మత్తయి 1:19) పరిశుద్ధాత్మపూర్ణులు ప్రవచించిన విధానం చూస్తే బిడ్డ విషయంలో కూడా ఆమెకు సంతోషం లేని విధంగా వుంది (లూకా 2:34). ఎన్ని సమస్యలు ఆయన ద్వారా తలెత్తుతాయో అన్నీ తెలిసివుండి కూడా ఆమె ఎలా జరగాలని వుందో అలాగుననే జరగునుగాక (లూకా 1:38) అనుకుంది. యషువ మెస్సీయను గూర్చి చెప్పబడిన మాటలన్నియు తన హృదయములో తలపోసుకొని భద్రము చేసుకొంది (లూకా 2:19). అంతేగాని మనుష్యుల సంగతులను గూర్చి ఆలోచించలేదు. లేక నాఖర్మ అనుకోని సరిపెట్టుకోలేదు. అందుకే తండ్రి చిత్తం చేయడం అంటే అంత సులభమైన పనికాదు.

-యషువ మెస్సీయ చేసే ప్రతీ మంచిపనికి భక్తిరూపంలో ఉన్న సాతానుగాళ్ళు (సున్నతి పొందిన నీచ యూదులు) అడ్డుబండలుగానే ఉన్నారు గాని, ఎప్పుడూ ఆయనకు సహకరించలేదు. ఇప్పుడూ అంతే: యోహాను 9 అధ్యాయం చూడండి పుట్టుగుడ్డువాని కన్నులు తెరిచిన తర్వాత; తెరవబడిన అతనిని, అతని తండ్రిని తల్లిని హింసించిన విధానం చూడండి. సంఘకట్లు, కులకట్లు, మతకట్లు, లోకల్‌కట్లు, వివాహకట్లు, మొ॥గు ప్రతీ నీచమైన కట్లుతో వారిని హింసిస్తూనే ఉన్నారు ఆమతాధికారులు, ఆమతచాంధస్సులు, ధర్మశాస్త్రోపదేశకుల్లా కనిపించిన దరిద్రులు. వీళ్ళు కళ్ళు తెరవలేక పోయారు, భిక్షము ఎత్తడం మాన్పించలేకపోయారు, చూపు పొందినది నమ్మలేదు (యోహాను 9:18) తల్లిదండ్రుల దగ్గర ఎంక్వయిరీ చేసారు. వాళ్ళు అబద్దాలు ఆడడాన్కి వీళ్ళే కారకులు అయ్యారు (వీళ్ళు వెలివేస్థారనే వాళ్ళు అబద్ధం ఆడారు యోహాను 9:22) ఒక్కసారి చెపితే వినక రెండవసారి పిలిపించారు. మెస్సీయను నమ్మవద్దని, మెస్సీయ శరీరం ధరించి వచ్చిన యావె అని గ్రహించక, ఇంకా ఎవరో ఎలోహీం ఉన్నాడని ఆయనను నమ్మమని, మెస్సీయను పాపి అని చెప్పమని సోదె వల్లిస్తున్నారు ఈ గుడ్డి సున్నతి సంబంధులైన యూదులు. యషువ మెస్సీయను చాలా నీచంగా తీసిపారేస్తూ, ఆయన చేసిన, చేస్తున్న ఏమంచి పనినీ కనీసం మానవత్వవైఖరితోనైనా గౌరవించక మాట్లాడుట మాత్రమే గాక హీనంగా చిత్రించుట ఈ నీచులకే (సున్నతి పొందిన యూదులు) చెల్లింది. వాళ్ళను కాదన్న వారినందరినీ, చెడుగా మాట్లాడటం, వాళ్ళపై చెడు ప్రచారం చేయడం, వెలివేయడం, మొ॥గు పనులు చేసారు. ఈ నీచుల ద్వారా పుట్టు గుడ్డివాడైన వ్యక్తి చూపు కలిగి అనుభవించిన బాధలు ఎన్నో? అతని స్థానంలో మనం నిలబడి ఆలోచిస్తే తెలుస్తుంది. నేడు కూడా మన మధ్య ఇలాంటి వారు ఉన్నారు. వారు ఎంత భక్తి నటిస్తున్నారో కాదు మనం చూడవలసింది. వాళ్ళ క్రియలు ఎలా ఉన్నాయో చూడాలి (మత్తయి 7:16-20).

- అటులనే ఈ స్త్రీ అనుభవించిన క్షోభ చూడండి లూకా 7:36-50. ఒక చెడు వ్యక్తిని చూడగానే యూదయా భక్తి కలిగిన దుష్టులలో ఎంత, ఎన్ని నీచ స్వభావములు బయటపడినవో తెలుస్తుంది. అక్కడికీ యషువ మెస్సీయ బుద్ధిచెపుతున్నా బుద్ధి తెచ్చుకోలేదు. స్వనీతిపరులు, మహావేషదారణ భక్తి నటించేవారు అలా ఉంటారు. యషువ మెస్సీయ పరిచర్యలోనూ, ఆఖరికి అపోస్తలుల పరిచర్యలోను ఈ దుష్టయూదులు ఇదే నీచమైన రీతిగా ప్రవర్తించారు.

- ఈ స్త్రీ విషయం చూడండి మార్కు 14:3-9. ఈమె పరమతండ్రి విషయంలో ఒక మంచి కార్యం చేస్తుంటే అక్కడ కొందరు ఆమె విషయమై విమర్శిస్తున్నారు. స్త్రీలు గాని, పిల్లలు గాని, పెద్దలు గాని, ఎవరైనా కానివ్వండి, ఎవరైతే పరమతండ్రి కొరకు ఏదో ఒక మంచి పని చేయడానికి పూనుకుంటారో వారిని సాతానే కాదు భక్తుల్లా కనిపించేవారు సహితం బాధించక మానరు. అది అంతే: మనకంటే ముందుగా మంచి పనులు చేసిన వారంతా ఇవే బాధలు, శ్రమలు, హింసలు అనుభవించారు. మనమూ అనుభవించవలసినదే. అదే మార్గము గుండా మనమునూ ప్రయాణించవలసినదే, తప్పదు.

- యాసోను గూర్చి చూడండి. యాసోను అపోస్తలుడైన సౌలును-సీలను చేర్చుకున్నాడని అతనిని అతని కుటుంబాన్ని ఎలా అల్లరిపాలు చేసారో చూడండి. అ॥కార్య 17:5-9).

- లాజరును గూర్చి చదవండి. అతనిని ఏమి చెయ్యాలని యూదులు ఆలోచించారో చూడండి. యోహాను 12:9-11; ఈ దుష్టయూదుల భక్తి అంతా కుట్ర ఆలోచనలతోనే కొనసాగింది. యావె భయము లేదు గాని మాటాడితే ధర్మశాస్త్రం ధర్మశాస్త్రం అంటూ అధర్మశాస్త్ర పనులు/(కియలు చేసేవారు 1థెస్స 2:15,16.

- పరమతండ్రి ఎవరినైతే ఎన్నుకుంటాడో, లేక ఎవరి ద్వారానైతే ఆయన పనులు చేస్తూ ఉంటాడో వారిని సాతాను సాతాను సంబంధులు వదిలిపెట్టరు. సాతాను డైరెక్టుగా సాతానులా రాలేక భక్తి వేషంలోనే, విశ్వాసుల్లోంచే వస్తాడు. దానిని పరమతండ్రి బిడ్డలు కనిపెట్టాలి మత్తయి 16:23, అ॥కార్య 15:37-39, ప్రకటన 2:2,9,3:9

- కుటుంబంలోనే విరోధులు (తండ్రికి యిష్టం కానివారు) ఉంటారు (మత్తయి 20:36). భర్త-భార్యల మధ్య ఏకాత్మ ఉండదు (1కొరింధి 7:16, 1 సమూ 25:2,3,39) తండ్రి-కుమారుల మధ్య పొసగదు. అటులనే తల్లి-కుమార్తె మధ్య కూడా పొసగకపోవచ్చును (మత్తయి 10:34-39). అప్పుడు శోధనలు తప్పవు, శ్రమలు తప్పవు, బాధలు, ఇబ్బందులు మొ॥నవి తప్పవు. శరీరసంబంధులకు-ఆత్మ సంబంధులకు వైరము తప్పదు (గలతీ 4:29).

-కుటుంబాలలోని సంబంధబాంధవ్యాలన్నిటి కన్నా భర్త-భార్యల సంబంధం చాలా విలువైనది. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెంద్రు, ఇంకా వేరే ఏవిధమైన బంధుత్వము లేక బాంధవ్యాలు అయినా శత్రువులుగా మారితే జీవితంలో మరళా కలువవచ్చు, కలవకపోవచ్చు. కాని భర్త-భార్యలు ఏక శరీరం గనుక, సహజంగా గొడవలు, పేచీలు, చిరాకులు మొ॥నవి అన్ని కుటుంబాలలోనూ ఉండొచ్చు.కాని చాలా తొందరగా (సూర్యుడస్తమించే సమయానికి) అవి సద్దు అణిగిపోవాలి, పోతాయి. కాని భక్తి విషయానికొస్తే రాజీ పడనివ్వదు సాతాను. కేవలం భక్తి కోసం, భక్తి సాకుతో విడిపోయిన భర్త-భార్యలు ఉంటారంటే నమ్ముతారా? నమ్మశక్యం కాదు: నమ్మకూడదు కూడా: చదవండి 1కొరింది 7:1-15. కాని యిలాంటి వాళ్ళు కూడా ఉన్నారు. చాలా మంది భర్త-భార్యలు అనేకమైన ఆలోచనలలో ఏకీభవించకపోవచ్చును అయినా వారు భర్త-భార్యలు గానే చలామణి అవుతుంటారు.

-భార్యలకు తెలియకుండా భర్తలు, భర్తలకు తెలియకుండా భార్యలు కొన్నికొన్ని మంచి మంచి పనులు చేస్తూ ఉంటారు. దానికి ఒకే ఒక్క ఉదాహరణ అబీగయీలు (1 సమూయేలు 25:2-39). భర్త కాలేబు సంతతి వాడైనను క్రియలలో మోటువాడు దుర్మార్గుడు. అబీగయీలు అతనిని భరిస్తూంది. మేలు చేసిన వ్యక్తులకు కీడు చేయడం ఇతడి బుద్ధి. అందుకే భార్యయైన అబీగయీలు భర్త చాటుగా యావె యుద్ధములు చేయుచున్న దావీదునకు (25:28) ఎదురుపడి గొడవలు పడకుండా ఆపి తన మంచితనమును ఋజువు పర్చుకుంది. ఇలాంటి అబీగయీలులు క్రైస్తవ లోకంలో ఎందరో ఉన్నారు. భర్త చాటుగా మంచి పనులు (చెడుపనులు కాదు) చేసిన/చేస్తున్న వారు శ్రమలు అనుభవిస్తూనే ఉన్నారు. ఇదీ

శ్రమతోనూ, బాధతోను, నష్టముతోను కూడిన పనియే.

-ఇలా చూసుకుంటూ వెళ్ళితే, బైబిల్లో పరమతండ్రి పనికొరకు నిర్ణయింపబడిన వారు, తన పనికొరకు ఆయుత్తపరచబడినవారు, తన పనికొరకు ఏర్పాటు చేయబడినవారు, బాధలు పడుతూనే ఉన్నారు. హింస అనుభవిస్తూనే ఉన్నారు. ఇవన్నీ మనుష్యులకు తప్పుగా కన్పించెడి సన్నివేశములు. స్త్రీలు భక్తిరాండ్రే అయినా, వారు చేసేది మంచిపనే అయినా భర్తకు చాటుగా అనేది అపార్థాలకే దారితీస్తుంది గాని మంచిగా కనిపించదు. మరి భర్తలు భార్యలకు యిచ్చిన స్వేచ్ఛ ఎంత? షునేమీయురాలు (2 రాజులు 4:8-37) చెప్పిన మాట తన భర్త విన్నాడు. మరి ఈనాడు భార్య భక్తురాలైయుండి, ఏవిషయమైనా భర్తకు చెపుతుంటే వినే భర్తలు ఎంతమంది? బైబిల్లో ఏదైనా ఒక రిఫరెన్సు ఎక్కడుంది అని అడిగితే స్త్రీలు చెప్పగలుగుతున్నారు గాని సమాజములోని పురుషులు (భర్తలు) చెప్పలేకపోతున్నారు ఎందుకని? బైబిలు ప్రకారంగా స్త్రీల (భార్యల) దగ్గర పురుషులు (భర్తలు) వాక్యం నేర్చుకోవాలా? లేక భర్తల దగ్గర భార్యలు నేర్చుకోవాలా? చదవండి ఈ వాక్యం 1 కొరింధి 14:34,35. మరి పురుషులు ఎందుకు వాక్యం చెప్పినట్లుగా లేరు?

-మోషే ఎంతో ఉన్నతమైన స్ధానం నుండి క్రిందికి దిగి వచ్చాడు. వచ్చి ఏమి సంతోషపడిపోయాడో ఈ వాక్యం చదివితే తెలుస్తుంది. హెబ్రీ 11:24-26. -యోనాతాను దావీదును ప్రేమించి, తన దుప్పటి, కత్తి, విల్లు నడికట్టు యిచ్చి, చాలాసార్లు ప్రమాణాలు చేసుకొని సంతోషంగా దావీదుతో ఉండాలనుకున్నాడు. కాని దురాత్మతో పీడించబడుతున్న తండ్రి ద్వారా ఎన్నోసార్లు దావీదుకోసం చీవాట్లు కాసి, నీచంగా తృణీకరించబడి ఆఖరికి తన తండ్రితో యుద్దానికి వెళ్ళి యుద్ధంలో మరణించాడు. యోనాతాను దావీదుతో ఎక్కడ సంతోషంగా ఉండగలిగాడు?

-ఎక్కడైనా సరే చూడండి. మంచి చేసిన వానికి/వారికి మంచే ఎదురవ్వుతాది అనేది చాలా కష్టతరమైన విషయం. మంచికి వెళ్ళితే చెడు ఎదురొచ్చే రోజులలో మనం ఉన్నాము. నీతిగా వెళ్ళితే తప్పనిసరిగా నిందలు అనుభవించాల్సిందే. అబద్దాలను నమ్మినంత తొందరగా/సులువుగా నిజాన్ని నమ్మలేని భక్తుల మధ్య మనం ఉన్నాం. ఏది ఏమైనా కాలమే ప్రతీదానికి సమాధానం చెపుతొంది. ఎవరు, దేనికొరకు చేస్తే దానికి సంబంధించిన ప్రతిఫలము వారు అనుభవించక మానరు. మంచికైనా-చెడుకైనా ప్రతిఫలము అనేది మాత్రం అందరికీ యిచ్చే పరమతండ్రి పైన ఉన్నాడు.

**-ప్రవక్త అని ప్రవక్తను చేర్చుకొనువాడు ప్రవక్త ఫలము పొందును, నీతిమంతుడని నీతిమంతుని చేర్చుకొనువాడు నీతిమంతుని ఫలము పొందును. మరియు శిష్యుడని యెవడు ఈ చిన్నవారిలో ఒకనికి గిన్నెడు చన్నీళ్ళు మాత్రము త్రాగనిచ్చునో వాడు తన ఫలము పోగొట్టుకొనడని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. మత్తయి 10:41,42.**

# త్యాగానికి ఫలితం మోసమా?

*బ్రదర్ సి.హెచ్. చంద్రశేఖర్, 99899 70579.*

కరుణ అంటే తెలియని కఠినులపై పరమతండ్రి యషువ తన కరుణను చూపించారు. కఠిన హృదయులైన కొందరు ఆయన కరుణను పొందుచున్నను, కరుగని రాతిబండవలెనే యున్నారు. యషువ మన పాపముల కొరకు గొల్గత కొండపైన చేసిన పాపపరిహారమును లక్ష్యపెట్టకయున్నారు. ఎంత నిర్లక్ష్యపు స్తితిలో ఉన్నారో ఆయన ప్రజలు. భూమిని ఆకాశమును, సర్వలోక సృష్టిని సృష్టించిన సర్వశక్తిమంతుడే ఈ లోకమునకు రక్షకునిగా వచ్చి మనలను మన పాపములనుండి రక్షించి తన నీతి రాజ్యములో చేర్చుటకు ఏర్పాటుచేసిన మార్గమున నడువమని ఆయన తన అడుగుజాడలను మనకు మాదిరిగా ఉంచి వెళ్ళినారు. **"మెస్సీయ కూడా మీ కొరకు బాధపడి మీరు తన అడుగు జాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను" 1పేతురు 2:21** ఆయనే మనకొరకు ఎంతో బాధపడినారు. దానిని ఎవరూ గ్రహించడంలేదు. ఆయన చూపుచున్న ప్రేమను లోకువుగా తీసుకుంటున్నారు, ఆయన కృపను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆయనను ప్రేమిస్తున్నాను అని ఎంతో చక్కగా పాటలు పాడుచున్నారు, వాక్యములు చదువుచున్నారు. ప్రార్ధనలు చేస్తున్నారు, సాక్ష్యములు చెపుతున్నారు, అన్నీ మాటల వరకే పరిమితం గాని క్రియలు ఏమి కనిపించడంలేదు.

**"మన మాయన ఆజ్ఞలను గైకొనుటయే ఎలోహీంను ప్రేమించుట" 1యోహాను 5:3** కనుక ఆజ్ఞలను గైకొనుచూ ఆయన ప్రేమను మన ప్రవర్తన ద్వారా తెలియజేయువారమై యుండాలి. కాని తీయటి నోటిమాటల ద్వారా కాకుండా క్రియలతోను విశ్వాసంతోను, సాక్ష్యమిచ్చువారమై యుండాలి. ఎందరో చెబుతూ ఉంటారు. కాని వారు చెప్పేదానికి వారు చేసేదానికి సంబంధం ఉండదు. వారు స్వనీతిని ప్రదర్శించుకొనుటకు చెప్పెదరు కాని నీతిని చూపించలేరు కాని మన మెస్సీయ మాట ఇచ్చి తప్పనివాడు, చెప్పిన దానిని చేసి చూపించేవాడు ఈయనను అనుసరించిన శిష్యులు కూడా సాక్ష్యం ఇస్తున్నారు. **మాటతో మాత్రమే గాక శక్తితోను, పరిశుద్ధాత్మతోను (1థెస్సలోనిక 1:5)** కార్యములు జరిగేవి. కానీ నేడు అవకాశమును బట్టి, పరిస్థితులను బట్టి, అనుకూలతతో జరుగుచున్నవి. మానవుడు ఏవిషయములో కూడా పరమతండ్రికి నమ్మకంగా ఉండలేక పోతున్నాడు. వాక్యంలో నమ్మకంగా ఉంటే శరీర క్రియలలో పడిపోతున్నాడు. శరీరక్రియలలో నీతిగా ఉంటే ధనం విషయములో పడిపోతున్నాడు ఏదో ఒక రకంగా పరమతండ్రికి దూరంగానే ఉంటున్నాడు. బీదవానిగా ఉండి పరమతండ్రికి మొఱ్ఱపెడితే ఆయన పరిస్థితులను మార్చి ఒక స్థానం ఇస్తే ఇచ్చిన స్థానమును బట్టి వారు స్థానం ఇచ్చిన వాని ఆజ్ఞలకే ఎసరు పెట్టేస్తున్నారు. రాత్రి అగ్ని స్తంభముగా పగలు మేఘ స్తంభముగా ఉండి అరణ్యంలో ఆకలితో ఉండగా ఆహారమును ఇచ్చి, దప్పికతో నుండగా దాహము తీర్చి చంటి బిడ్డను చంకన పెట్టుకొనునట్లు ఇశ్రాయేలు ప్రజలను బానిసత్వమునుండి స్వతంత్రులుగా బయటకు పరమతండ్రియైన యావె తీసుకువస్తే ఆ జనాంగము అంతా కలిసి ఒక దూడను చేసుకొని పూజించి ఐగుప్తునుండి మమ్మల్ని తీసుకువచ్చిన యావెవు నీవే అని ఆ పోత దూడతో అన్నారు. నిర్గమ 32:4. నేడు ఆయన ద్వారా అన్నీ పొందుకున్నవారు, అన్నిటిని అనుభవిస్తున్నవారు: నాప్రాణమా తినుము త్రాగుము సుఖించుము అని చెప్పుకుంటున్నారు. ఆయన మ్రాను మరణానికి విలువ ఇవ్వని జనులైనారు, ఆయన బాధకు చలించని కఠినులైనారు. ఆయన మోయలేని మ్రాను భారమును మోస్తూ నడవలేకుండా అడుగులు తడబడుతూనుంటే ఆ యొక్క స్థితిని వాక్యంలో చదివి ఆయన కష్టానికి కరగని వారైనారు ఈ జనులు. తలపై ముళ్ళ కిరీటమును పెట్టి కొరడాలతో చెళ్ళుమని మెస్సీయ దేహంపై కొడుతుంటే అంతటి వేదనను అంతటి బాధను మన కొరకై సహించి, భరించి, క్షమించి శ్రమిస్తే కాగితంపై అక్షరాలే కదా అన్నట్టుగా చదివి వదిలేసే స్థితికి నేటి క్రైస్తవ్యం చేరుకుంది. అర చేతులలో మేకులను కాళ్ళల్లో నుండి మేకులను కొట్టి బల్లెంతో పొడిచి హేళన చేస్తూ యూదుల రాజా! ఎలోహీం కుమారుడా!నీవు ఇతరులను రక్షిస్తావు గాని నిన్నునీవు రక్షించుకోలేవా అని అపహసించి, దూషించి దుర్మార్గపు పనులు చేస్తుంటే పాపంలేని పరమతండ్రియైన యషువ మెస్సీయ- తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను (లూకా 23:24) ఆయన అన్ని హింసలు పొందుచు ఎందుకు జాలి చూపించారో ఆలోచించండి. అన్ని అవమానములను ఎదుర్కొని మనకు ఆదరణ మాటలను ఎందుకు చెప్పారో గ్రహించండి. ఎవరైనా కోపంగా మనలను చూస్తే ఓర్చుకోలేని మనం చేసిన తప్పును ఉన్న మాటను ఎత్తి చూపితే సహించుకోలేని మనం ఎంతగా హెచ్చించుకొని జీవిస్తున్నామో పరీక్షించుకొండి. ఏపాపము చేయనివాడు ఏ తప్పును చేయనివాడు అన్యాయపు తీర్పును పొంది మన అందరి పాపములను తానే భరియించుకొనిన పరమ పవిత్రుడు, అతి పరిశుద్ధుడు సర్వాధికారి మన శాపములను ఎత్తుకొని శాపగ్రస్తుడయ్యెను గలతీ 3:14. కానీ ఆయన శాపగ్రస్తుడు కాడు శాపములను పరిగ్రహించువాడు, అయితే ఆయన ఎన్నో ఆపరాధములను మోసి, ఎన్నో అతిక్రమములను తీసివేసి, ఆయన రక్తమునంత ధారపోసి ఆయన రక్షణను, నీతి మార్గమును మనకు ఏవిధమైన కష్టము లేకుండా, శ్రమలేకుండా, మన పాపములకు మనము శిక్షనొందకుండా అన్నీ ఆయనే పొంది, మాదిరై మార్గమును చూపి ఆయన ఆజ్ఞలను గైకొని నడువమంటే ఆయన మాటను వినకుండా ఆయన మాటలకు విపరీత అర్ధములు చెబుతూ తమ స్వకీయ నాశనమునకు వారు ప్రయాసపడుచున్నారు. 2పేతురు 3:16. ఆయన యొక్క ఆత్మావేశము వలన కలిగిన వాక్యమును అపార్ధముతో వివరించుట ఎందుకు? ఆయన చెప్పని వాటిని చెప్పుట, చెప్పిన వాటిని ప్రజలకు చెప్పకపోవుట వలన శ్రమ ఎదురౌతుంది యెషయా 5:20. ఆయన ప్రేమించేదానిని ప్రేమించక ద్వేషించడం, ఆయన ద్వేషించేదానిని ద్వేషించక ప్రేమతో హత్తుకొనడం ప్రస్తుతం జరుగుతుంది. ఆయనకు నచ్చనిదానిని ప్రజలు ఎంతో మక్కువతో ఆశక్తితో హృదయపూర్వకంగా చేస్తున్నారు. ఇది న్యాయము కాదని ఆయన వాక్యం చెబుతున్నా వినని వారైయున్నారు. ఆయన వాక్య విషయము తప్ప మిగిలిన అన్ని విషయాలు ఎంతో ఆసక్తితో వింటూ వాటికి అధిక సమయమును వాటికి మొదటి స్థానమును ఇస్తున్నారు.వారికి ఆయన వాక్యమంటే సంతోషము లేకుండా ఉన్నది. వీరికై వాక్యము వ్రాయబడియున్నది. **"ఇదిగో వారు యావె వాక్యమందు సంతోషము లేనివారై దాని తృణీకరింతురు కావున నేను యావె క్రోధముతో నిండియున్నాను"** యిర్మియా 6:10. ఆయన ఎంతో ప్రేమించి, హత్తుకొని ఆదరించాలని అనుకొనియుంటే ఆయన ప్రేమను కాదని త్రోసివేసేవారైయున్నారు. **"నడికట్టు నరుని నడుమునకు అంటియున్నరీతిగా నన్ను అంటి యుండజేసితిని గాని వారు నామాటలు వినకపోయి యున్నారని యావె సెలవిచ్చుచున్నాడు" యిర్మియా 13:11** ఆయన తన అరచేతిలో మనుష్యులను చెక్కి ఆయన పోలికతో చేసి జ్ఞానము నిచ్చి, ఆలోచన నిచ్చి, అన్ని సమకూర్చి యుంటే ఆయనను లెక్కచేయకయున్నారు. **"యావె మాటలాడుచున్నాడు ఆకాశమా, ఆలకించుము, భూమీ, చెవియొగ్గుము నేను పిల్లలను పెంచి గొప్పవారినిగా చేసితిని వారు నామీద తిరుగబడియున్నారు"** యెషయా 1:2 ఆయన కరుణించి పిలుస్తుంటే పలుకక దూరమగుచున్నారు. **"అయితే నేను పెందలకడ లేచి మీతో బహుశ్రద్ధగా మాటలాడినను మీరు నామాట వినకున్నారు"** యిర్మియా 35:14,17. మానవులకు కావలసిన అన్నిటిని పరమతండ్రి సమయానుకూలముగా అందరికి ఇస్తున్నారు. ఆకలితో నున్నప్పుడు ఆయన ఆహారమును ఇచ్చితృప్తిపరచుచున్నారు. ఆశ్రయములేని సమయములో ఆశ్రయమై, అనారోగ్యమైన సమయములో ఆరోగ్యమునిచ్చి, బలహీనమైన సమయములో బలమునిచ్చి, ఆపద కాలములో ఆదరణ నిచ్చి, కృంగిన వేళలో ఓదార్పునిచ్చి, నిరుత్సాహంగా ఉంటే ఉత్సాహమునిచ్చి, కష్టకాలములో కాపాడి, అంధకారములో వెలుగుగా ఉండి అన్నివైపులా అన్ని అవసరతలను తీర్చి కాపాడుచుంటే ఆయన ఇచ్చిన వాటన్నిటిని ఆయనకు వ్యతిరేకమైన పనులు చేయడానికి ఉపయోగిస్తున్నారు. ఆయన బలము ఇస్తే ఆ బలముతో ఆయనకు విరోధమైన పాపములు చేస్తున్నారు. ఆయన తెలివిని, జ్ఞానమును ఇస్తే ఆయన ఆజ్ఞలను మీరి వారి తెలివితోను, జ్ఞానముతోను వారి అతిక్రమమును క్రమమేనని సర్ధిచెప్పుకుంటున్నారు. అక్రమాలతోను, అక్రమబంధాలతోను, అబద్ధములతోను, అన్యాయముతోను, ఆయన ప్రేమను నిరర్ధకం చేస్తున్నారు. ఆయన అన్ని విధములుగా న్యాయవంతుడైయుండి ఎంతో త్యాగం చేస్తే ఆ సాటిలేని త్యాగానికి విలువ ఇవ్వకుండా మోసగాండ్రై జీవిస్తున్నారు. మీమోసమునకు కలుగు శిక్షనుండి తప్పించుకొనలేరు. ఎక్కడా దాగుకొనలేరు. **"యావె సెలవిచ్చినమాట ఏదనగా నాకు కనబడకుండా రహస్య స్థలములో దాగగలవాడెవడైనా కలడా? నేను భూమ్యాకాశముల యందంతట నున్నవాడను కానా? యిదే యావె వాక్కు"** యిర్మియా 23:24 కనుక ఎవరునూ కూడా ఆయన సముఖమునుండి తప్పించుకొని పోలేరు. జీవముగల ఎలోహీం చేతిలో పడుట బహు భయంకరము. అందువలన త్యాగాన్ని చులకన చేసి మిమ్మును మీరు మోసము చేసుకొనకండి (గలతీ 6:7) ఆయన రక్షణ పొందకుండా, ఆయన పరిశుద్ధమైన ఆజ్ఞలను గైకొనకుండా ఎవరూ ఆయన రాజ్యమునకు వారసులు కాలేరు. ఆయన ఆజ్ఞలయందే జీవము ఉన్నది.

**"మీతో సాక్ష్యముగా నేడు నేను పలికిన మాటలన్నిటిని మీ మనస్సులలో పెట్టుకొని, మీ సంతతి వారు ఈ ధర్మశాస్త్రవాక్యములన్నిటిని అనుసరించి నడుచుకొనవలెనని వారికాజ్ఞాపించవలెను. ఇది మీకు నిరర్ధకమైన మాట కాదు ఇది మీకు జీవమే"** ద్వితీ 32:46,47. జీవమును ఇచ్చిన వానిని విసర్జించకండి. **"జీవజలముల ఊటనైన నన్ను విడిచియున్నారు"** యిర్మియా13+17:13. మీరు విడిచినను ఆయన తిరిగి రమ్మని అంటున్నారు. **"మనుష్యులు పడి తిరిగిలేవకుందురా? తొలగిపోయిన తరువాత మనుష్యులు తిరిగిరారా?"** యిర్మియా 8:4. తిరిగిలెండి ఆయన నీతైన మార్గమును అనుసరించండి, తంత్రములను కల్పించుకొనకుండా ఉండండి. **"ఏమనగా ఎలోహీం నరులను యదార్ధవంతులనుగా పుట్టించెను గాని వారు వివిధమైన తంత్రములను కల్పించుకొనియున్నారు"** ప్రసంగి 7:29. మోసమును తంత్రములను వీడి ఆయన ఇచ్చు తిండితింటూ, ఆయన ఇచ్చిన వాటిని అనుభవిస్తూ ఆయనకు వ్యతిరేకులు కాకుండా జీవించండి ఆయన చేసిన మహాగొప్ప త్యాగమును వృధా చేయకుండా ప్రతిఫలంగా పరమతండ్రి మార్గంలోనికి చేరి మరికొందరిని నరక అగ్ని నుండి బయటకు లాగండి. ఆయన నీతియుక్త ఆజ్ఞలను దిక్కరించి ఆయన నీతికి విరోధులు కాకండి ఆయనే సర్వమును సర్వశక్తిమంతుడని గ్రహించండి. యావె మిమ్మును కాచి తన మార్గమందు విడువక నడిపించును గాక!

# సమస్య - పరిష్కారం

*-బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ*

ప్రతీ చోట ఏదో ఒక సమస్య ఉంటుంది. సమస్య అనేది ఏదేను తోట నుండి ప్రారంభం అయ్యింది. విరోధి ఉన్నాడు గనుక సమస్య అనేది ఉంది. అయితే సమస్య ఎక్కడుందో అల్లరి అక్కడే ఉంటుంది, నష్టం కూడా అక్కడే ఉంటుంది. చాలా చెడు అక్కడే జరుగుతుంది. అయితే ప్రతీ సమస్యకు పరమతండ్రి పరిష్కారం ఏర్పరచే ఉంటాడు. పరిష్కారంలో కూడా మనుష్యులు నష్టపోవలసినవి ఉంటాయి, లేక లాభపడేవి ఉండొచ్చు. ఏది ఏమైన ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంది.

ఏదేను తోటలో ఆదాము-హవ్వలు చేసిన పనికి పరిష్కారం పరమతండ్రి ఆలోచించాడు. సాతానుగాడు సమస్య సృష్టించి సర్వనాశనం చేసాడు. నాశనం నుండే పరమతండ్రి రక్షణ మార్గం వాళ్ళకు చూపించాడు. (ఆది 3:16-21, 1తిమోతి 2:13-15) పరిష్కారం అయ్యిపోయాక జరిగిన దానిని గూర్చి ఆలోచించడం అనవసరం. ఒకవేళ ఆలోచించినా వారు (ఆదాము-హవ్వలు) మునుపటివలె ఉండలేరు గదా! ఒక సమస్య ద్వారా వారు ఏదో అవ్వాలనుకొని అవ్వకూడనిది అయ్యారు. అది పరిష్కారం లేని స్తితి ఉన్నప్పుడు పరమతండ్రి దానికి పరిష్కారం చేసి చూపించాడు. గనుక జరిగిన విషయాన్ని తలంచుకుంటూ (సామె 17:96) మిత్రబేధము కలుగజేసుకునే దానికన్నా, జరగవలసినది ఆలోచించడమే మంచి మనుష్యులు చేయవలసినపని. అదే అవ్వమ్మ చేసింది. (ఆది 4:1) గనుకనే జరిగిన దానిని తలంచుకొని బాధపడలేదుగాని యావె దయవలన నేనొక మనుష్యుని సంపాదించుకొన్నాననెను. (ఆది 4:17) అలా ఆదాము-హవ్వల జీవితం వేరే మార్గంలో సాగుకుంటూ నడిచింది. సమస్యలు తలెత్తెడివి. వాటికి పరిష్కారం వారు చేసుకునేవారు. ఎందుకంటే ఎప్పుడైతే వారు పాపము చేసారో అప్పుడే వారికి అన్నీ తెలిసాయి. ఆదాము పరమతండ్రియైన యావె కుటుంబంలో ఒకని వంటివాడయ్యి మంచి-చెడ్డలను ఎరిగినవాడాయెను (ఆది 3:22). గనుక ప్రతీ సమస్యను పరమతండ్రే వచ్చి పరిష్కారం చేయవలసిన పనిలేకుండా వారి సమస్యలను వారు పరిష్కరించుకోగలిగేవారు.

– సమస్యలు సృష్టించడం సాతాను పనైతే, వాటికి పరిష్కారం వెతుక్కోవడం లేక పరిష్కరించుకోవడం పరమతండ్రి బిడ్డలు చేయవలసిన పని. అయితే వాటిని ఎలా పరిష్కరించుకోవాలో అనే కొన్నింటికి ఖచ్చితంగా పరమతండ్రి ఆలోచన అవసరం. అందుకే ప్రార్ధన అనేది మనిషికి అవసరమయ్యింది. (ఆది 4:26)

– ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి బయలుదేరాక ప్రయాణంలో వారికి చాలా సమస్యలు ఎదురైనవి. వాటి పరిష్కారం కొరకు నాయకుడైన మోషే పరమతండ్రియొద్ద విజ్ఞాపన చేసి పరిష్కరించెడివాడు. కొన్ని సమస్యలు మోషే+న్యాయాధిపతులు పరిష్కరించినా, కఠినమైనవి మాత్రం పరమతండ్రిని అడిగి పరిష్కరించేవాడు. అదే పద్ధతిని మోషే తరువాత నాయకులు, విమోచకులు, రక్షకులు, న్యాయాధిపతులు, యాజకులు, ప్రవక్తలు చేసారు.

ఒక సమస్య మనముందున్నప్పుడు ముఖ్యంగా ఆలోచించవలసింది మూడు రకములుగా:

1) ఈ సమస్య సాతాను వలన వచ్చినదా? లేక

2) పరమతండ్రి వలన వచ్చినదా? లేక

3) మన స్వయంకృతాపరాధము వలన వచ్చినదా? .....*అప్పుడు దానికి పరిష్కారం ఆలోచించాలి.*

1) సాతానువలన వస్తే ఎలా పరిష్కరించుకోవాలి?

2) పరమతండ్రి వలన వస్తే ఎలా పరిష్కరించుకోవాలి?

3) మన స్వయంకృతాపరాధమువలన వస్తే ఎలా పరిష్కరించుకోవాలి?

వీటికి సమాధానం/పరిష్కారం ఆలోచించాలి. ఇలాంటి సమస్యలు మనకంటే ముందుగా నడిచిన భక్తులు ఎవరికైనా వచ్చాయా? వస్తే వారు ఎలా పరిష్కరించుకున్నారు? అనేది బైబిల్లో మనం చూడాలి. అదే రీతిగా మనమూ పరిష్కరించుకోవాలి 1కొరింథీ 10:11.

– ఐగుప్తుదేశమునుండి బయలుదేరిన ఇశ్రాయేలీయులకు అనేక సమస్యలు ఎదురయ్యాయి. ప్రతీ సమస్యకు పరిష్కారం పరమతండ్రి చూపించాడు. ఉదా:- నిర్గమ 15:22-26., మారాలో నీళ్ళు చేదైపోయినవి. దానికి పరిష్కారంగా ఒక చెట్టును చూపించాడు. అది ఆ నీళ్ళలో వేయగానే నీళ్ళు మధురం అయ్యాయి.

– అదేరీతిగా ఎలీషా కాలంలో విషమైన కూర (2రాజులు 4:38-41). దానికి విరుగుడుగా యావెజనుడు పిండి కలిపి వడ్డింపజేసాడు.

పరమతండ్రి చెప్పిన మాట ఏమంటే **"అభ్యంతరములు రాకమానవు. అవి ఎవనివలన వచ్చునో వానికి శ్రమ"** లూకా 17:1., పరమతండ్రి బిడ్డలు ఎప్పుడూ అభ్యంతరములు, శ్రమలు, సమస్యలు వస్తున్నందుకు బాధపడరు. వాటికి పరిష్కారం వెతుక్కుంటారు. సాతాను సంబంధులు మాత్రం పరిష్కారం వెతకరు గాని సమస్యలను ఇంకా ఉద్రిక్తం చేస్తూ ఉంటారు. సమస్యకు పరిష్కారం వెదకనివారిలో పరిశుద్ధాత్మ ఉండదు. ఏదైనా ఒక సమస్య వచ్చినప్పుడు దానిని పరిష్కరించుకోవడానికి ఇతరులపై అన్యాయమైన నిందలు మోపకూడదు., అక్రమముగా వారి స్థలములలో ప్రవేశించకూడదు, చెడు మాటలు పలుకకూడదు, ముఖ్యంగా బూతులు తిట్టకూడదు: లేనిపోనివి సృష్టించకూడదు, మనం నిజాయితీపరులం అని చెప్పుకోవడానికి ఇతరులపై నిందలు దూషణలు చేయకూడదు. ఎందుకంటే పరమతండ్రి మనకు పైగా ఉన్నాడు. రహస్యములు ఆయనకు మాత్రమే తెలుసు. ద్వితీ 29:29., అందువలన తెలియని విషయములు తెలిసినట్లుగా చెడుప్రచారం

చేయకూడదు. భారమైన నేరములు ఎదుటివారిపై మోపకూడదు. యుద్ధం చేసేటప్పుడు న్యాయప్రకారమైన యుద్ధం చేయాలి గాని దొంగదెబ్బ తీసి యుద్ధాలు చేయడం వీరుని లక్షణం కాదు. - సామెతలు 25:8-10, 18:13, 20:19, మొ॥గు సామెతలు మనం చదువుకొని ఎదుటి వారి విషయాలలో మనం జాగ్రత్త వహించవలసి ఉంది. సమస్య ఏదైనా పరిష్కారం అనేదే పరమతండ్రి బిడ్డలు చూసుకోవలసింది, చేసుకోవలసింది. అది వాక్యప్రకారంగాను, న్యాయసమ్మతంగానూ ఉండాలి. అప్పుడు అందరూ సంతోషంగా ఉండగలరు. మూర్ఖులైన సున్నతి సంబంధులైన యూదుల్లా, గర్వపడిపోతూ, లేక స్వనీతి ప్రదర్శిస్తూ ప్రవర్తింపరాదు. వారు యషువ మెస్సీయపై ఎన్నో నిందలు, నేరాలు మోపారు. యషువ మెస్సీయ మాటలు అపార్ధం చేసారు. కక్ష, కార్పణ్యములతో భక్తిని నాశనం చేసుకొని శాపగ్రస్థులైనారు. అదేరీతిగా అపోస్తలుడైన సౌలు విషయంలో కూడా చేసి నాశనం అయ్యారు. అట్టి నాశనపాత్రుల ఆత్మ ఉన్నవారు అటులనే నాశనం అయ్యిపోతారు. గనుక ప్రియ సహోదరుడా! సహోదరీ! నీ సమస్య ఏదైనా నీవు పరిష్కారం వెతుకుకో. పరమతండ్రియైన యావె అన్యాయస్థుడు కాడు. నీవు న్యాయంగా ఉన్నంతవరకూ పరమతండ్రి నీ పక్షముననే యుద్ధం చేస్తాడు. మనుష్యులకొరకు ఎదురుచూడకు, పరమతండ్రివైపు చూడు. ఒంటరిగానైనా నిలవబడు. తండ్రి సముఖములో నీ ఆత్మను కుమ్మరించుకో. పరిష్కారం ఆయననే అడుగు. నీవు నిజంగా పరమతండ్రి బిడ్డవైతే పరమతండ్రి చూపే పరిష్కారం వైపు చూడు. పరమతండ్రి ఎవరిద్వారా నిన్ను ప్రేమిస్తున్నాడో, ఎవరిద్వారా నిన్ను బలపరుస్తున్నాడో, ఎవరి ద్వారా నీకు సహాయం చేస్తున్నాడో, ఎవరి ద్వారా నిన్ను ఆదరిస్తున్నాడో వారిని చూసే కన్నులు నీకు ఉన్నవా? ఉంటే అటువైపు నీ దృష్టి మళ్ళించుకో. ఆయనే నిన్ను ఓదార్చి కాపాడతాడు. నీ సమస్యకు పరిష్కారం అదే.

నేను పరిచర్య ప్రారంభించి 25సం॥రాలు అయ్యింది. ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. మొదట్లో ఏదైనా సమస్య వస్తుంటే చాలా కంగారుగా, బాధగా ఉండేది. మనుష్యులందరూ ఒక వైపు ఉండేవారు. నేనొక్కడనే ఒకవైపు ఉండేవాడిని. నాకు దిక్కు మొక్కు పరమతండ్రే అయ్యేడివాడు. అన్ని విషయాల్లోనూ నేనే విజయం పొందేవాడిని. నాకు సహాయం చేసిన వారందరినీ మనుష్యులు బాధించేవారు. కాని నన్నుబట్టి పరమతండ్రి వాళ్ళను కూడా దీవించెడివాడు. అలా నాకొరకు-నా వారి కొరకు నేను ఒంటరిగా నిలబడేవాడ్ని. నా అన్ని సమస్యలకు పరిష్కారం పరమతండ్రియైన యావె. అందుకే నేను మనుష్యులను, ముఖ్యంగా సాతాను మనుష్యులను అసలు నమ్మను. భక్తుల్లో కూడా సాతానుని నేను గమనించగలను. గనుక వారి ఆలోచనలను నేను గౌరవించను. మనిషిని గౌరవిస్తాను కాని వారిలోనుండి మాట్లాడే సాతానుని నేను లక్ష్యపెట్టను. గనుక నేను ఏ విషయంలోనైనా ధైర్యముగానే ఉంటాను. మీరు కూడా అలా మన పరమతండ్రియైన యావెను నమ్ముకొని సింహాల్లా ధైర్యంగా ఉండండి.

కాలం కలిసిరాకపోతే తాడు పాము అయ్యి కరిచింది అన్నట్లు ఉంటుంది ఒక్కొక్కసారి మన ఆత్మీయ జీవితం. యోబును తండ్రి సాతానుకు అప్పగించాడు అంతకుముందు యోబు జీవితం (యోబు 29వ అధ్యాయం చదవండి) అలా వుండట. ఇప్పుడైతే తనకంటే తక్కువ వయస్సుగలవారు ఎగతాళి చేస్తున్నారట (యోబు 30:1). కుక్కలకన్నా హీనమైన వారు సహితం నోరు ఎత్తి మాట్లాడుతున్నారట. ఆఖరికి పనివానిని పిలుస్తున్నా వాడు కూడా పలకడంలేదట. యోబు 19:13-19., అయినా తన నిరీక్షణను ఆయన వదులుకోలేదు (19:25,26).

ఏది ఏమైనా కష్టము, శ్రమ, శోధన, యిబ్బంది మనుష్యులకు వచ్చినప్పుడే, నిజమైన స్నేహితులెవరో-కపట స్నేహితులెవరో తేలిపోతుంది. వాక్యం బోధించినంత తేలికగా ఉండదు అనుభవ జీవితం. ఏదో ఒక వైపుకి మనిషి మొగ్గకతప్పదు. ఎందుకంటే ఎవరూ ఇద్దరు యజమానులకు దాసులు కాలేరు గనుక: సమాధానపరిచే వ్యక్తిలానైనా వ్యవహరించాలి లేదా సైడ్ అయ్యిపోవాలి. విరోధమును అణిచివేసే వ్యక్తిగానైనా ఉండాలి. లేదా విరోధిగా మిగిలిపోవాలి. ఏదో ఒక సైడ్ (సాతానుకు గాని/పరమతండ్రికి గాని) అవ్వక తప్పదు. నిజంగా ఒక మనిషిని మనం ప్రేమిస్తే:

- ఆ వ్యక్తిని సంతోషపరచడానికి ఆ వ్యక్తి మాట వినాలి
- తనకు ఏమి చేస్తే యిష్టం అవ్వుతుందో అది చేయాలి
- మన ఇష్టాన్ని చంపుకొని ఆ వ్యక్తి ఇష్టాన్ని నెరవేర్చాలి
- దానికోసం ఎన్ని బాధలొచ్చినా, కష్టాలొచ్చినా భరించాలి
- రెండవ రకపు ఆలోచన (మన స్వంత ఆలోచన) చేయకూడదు
- నిజంగా ప్రేమిస్తే నిజంగా నమ్మాలి
- అంత అత్యవసరమైతే ఆ వ్యక్తికోసం మరణించాలి.

అది బైబిలు చెప్తున్న ప్రేమ. భక్తికి సంబంధించిన ప్రేమ. యషువ మెస్సీయ అటులనే చేసాడు. అదే మాదిరిని అపోస్తలులు నడిచారు.

-యషువ మెస్సీయ లోకం కోసం తను బలి అయ్యి, ఆ సువార్తను బయటి ప్రపంచానికి అందించడానికి 12మంది శిష్యులను ఎన్నుకున్నాడు. వారి ద్వారా తాత్కాలిక యిబ్బందులు, ఆటంకములు, అపార్ధములు, అభ్యంతరములు ఆయన ఎదుర్కొనెడివాడు. అయినా వారి ద్వారానే ప్రపంచానికి సువార్త అందించబడుతుందని ఆయనకు తెలుసు. తాత్కాలిక అబద్ధాలు, తాత్కాలిక ఎడబాటు, తాత్కాలిక వృత్తి, ఆయన సువార్తకు ఏమీ అడ్డుబండలు కాలేదు. ఉదా:- యషువ మెస్సీయ కేఫాను (పేతురును) ప్రేమించి పరలోక రాజ్య తాళపుచేతులు యిచ్చాడు, సమాజమునకు మూల స్తంభముగా చేసాడు, దయ్యములను వెళ్ళగొట్టే వరమును, వాక్‌శక్తిని యిచ్చి సువార్తకు పంపించాడు. విజయోత్సవంతో కేఫా తిరిగివచ్చెడివాడు. ఆఖరికి నీటిపై నడిచే సాహసం చేసాడు. మెస్సీయ కొరకు అనేకులతో పోరాడెడివాడు, కత్తి తీసుకొని నరకడానికి కూడా వెనుకాడలేదు. అలాంటి కేఫా (పేతురు), ఆయనను ఎరుగనని బొంకుతున్నాడు, పనికిమాలిన వ్యక్తుల దగ్గర ఒట్టుపెట్టుకొని మరీ నీచంగా వ్యవహరిస్తున్నాడు, వలపట్టుకొని సముద్రంలోకి వేటకి వెళ్ళిపోయాడు. అయినా యషువ మెస్సీయకు తెలుసు కేఫా ఎవరో? అదంతా పరిస్థితుల ప్రభావమునుబట్టి తాత్కాలికంగా జరుగుతున్న తతాంగమే గాని సత్యము మాత్రం కాదు. తరువాత యషువ మెస్సీయ కలిసి అడిగిన ప్రశ్నకు సమాధానం కేఫా ఏమి చెప్పాడో మీరే చదవండి. యోహాను 21:15-17., కేఫాకు యషువ మెస్సీయ హృదయం తెలియకపోతే తెలియకపోవచ్చునేమో గాని, యషువ మెస్సీయకు కేఫా హృదయం బాగుగా తెలుసు. అందుకే కేఫాను యషువ మెస్సీయ అపార్థం చేసుకోలేదు. యషువ మెస్సీయ మనస్సు, ఆత్మ, ప్రేమ ఉన్నవాళ్ళకే ఈ విషయాలు తెలుస్తాయి గాని లౌకిక ఆత్మ ఉన్నవారికి ఏమి తెలుస్తుంది?యషువ మెస్సీయకు కేఫాను గూర్చి పూర్తిగా తెలుసు. తను పరిచర్య సాగిస్తాడనీ, మెస్సీయకన్నా గొప్ప అద్భుతములు చేస్తాడనీ, 3000మందిని ఒక్కసారి మార్చగల గొప్ప ప్రసంగీకుడనీ, అన్నిటికంటే ముఖ్యంగా, పరలోకరాజ్యంలో ఒక సింహాసనముపై కూర్చుని తీర్పు తీరుస్తాడని తెలుసు. దూరదృష్టిగల వారు ఇలా ఉంటారు. గనుకనే దేనికీ కంగారుపడరు. పరిస్థితులనుబట్టి మనుష్యులు అబద్ధాలు ఆడితే అది నిజమవ్వదు. నిజమెప్పుడూ నిప్పులాంటిది. అటులనే నిజస్నేహితుడు ఎప్పుడూ విడువకుండానే ప్రేమిస్తాడు. శోధనలో వదిలేసి సంతోషంలో హత్తుకొనే వాడు నిజస్నేహితుడు అవ్వడు.

యషువ మెస్సీయ మనస్సు మీకు ఉంటే ఈ విషయములు మీకు అర్థం అవుతాయి. అట్టి మంచి ఆత్మ పరమతండ్రి మీకు అనుగ్రహించును గాక!

## పర్ణశాలల పండుగకు ఆహ్వానము

యావె యను రాజునకు మ్రొక్కుటకును పర్ణశాలల పండుగ ఆచరించుటకును ఏటేట వత్తురు.జెకర్యా 14:17

యూదా, నీ పండుగల నాచరింపుము. నహూము 1:15

యూదుల పర్ణశాలల పండుగ సమీపించెను. యోహాను 7:2

నిష్కాపట్యమును సత్యమునను పులియని రొట్టెతో పండుగ ఆచరింతుము. 1కొరింథీ 5:8

**జ్ఞాపకార్థ శృంగధ్వని పండుగ:**

**ఏతనీమ్ 1 = సెప్టెంబర్ 9**

**పాప ప్రాయశ్చితార్థ దినము:**

**ఏతనీమ్ 10 = సెప్టెంబర్ 18**

**పర్ణశాలల పండుగ:**

**ఏతనీమ్ 15-22 = సెప్టెంబర్ 23-30.**

## $ ప్రింటింగ్ స్పాన్సర్స్ కావలెను $

ప్రియ పాఠకులకు షలోం. ఇదివరకు మనం ప్రింట్ చేసిన చిన్న కరపత్రములు చాలా చక్కగా ప్రజలలో పనిచేసినవి. వాటి ద్వారా అనేకమంది సత్యసంబంధులైన విశ్వాసులు, బోధకులు ఎంతో బలపడ్డారు, స్థిరపరచబడ్డారు. అంతేకాకుండా అనేకమందికి బహుబలమైన వాక్యం అందించే వారిగా అనుభవము సంపాదించారు. ఆఖరికి వారి బైబిళ్లలో ప్రసంగదీపికల్లా మన పత్రికలు ఉపయోగించుకుంటున్నారు. మనం ప్రింట్ చేసిన పత్రికలు తక్కువ మోతాదుల్లో ఉన్నప్పటికీ, వాటిని జెరాక్స్ తీసి పంచిన వారు ఎంతోమంది ఉన్నారు. వాక్యం ద్వారా ఎదిరించలేని తప్పుడు బోధకులకు వారు జెరాక్స్ తీసి పంపించి నోరు ముయ్యించిన సంఘటనలు ఎన్నో మనకు తెలుసు. గనుక వాటినన్నిటినీ మరళా మనం రీప్రింట్ చేయవలసి ఉంది. గనుక మీవంతు సహకారం అందించి వాటి రీప్రింట్ కొరకు మీరు సహాయపడవలసినదిగా కోరుచున్నాము. ఇదివరకు మనం ప్రింట్ చేసిన కరపత్రముల లిస్ట్ ఈ క్రింద పొందుపరుస్తున్నాము చూడండి. మీకు ఎవరెవరికి ఎన్నెన్ని పత్రికలు అవసరమో మాకు వ్రాయండి రీప్రింట్ అవ్వగానే మీకు పంపిస్తాము. ఈ పరిచర్యలో పాలుపొందు ప్రతీ ఒక్కొక్కరినీ పరమతండ్రియైన యావె (యషువ మెస్సీయ) అత్యధికముగా దీవించి ఆశీర్వదించును గాక!

1. **అబద్ద బోధకుల ఆదివారం ఆరాధన**
2. **అబద్ద బోధకుల గుడ్‌ఫ్రైడే-ఈస్టర్ సన్‌డే**
3. **అబద్ద బోధకుల లెంట్ దినములు**
4. **అబద్ద బోధకుల క్రిస్ట్‌మస్**
5. **అబద్ద బోధకుల ప్రభురాత్రి భోజన సంస్కారము**
6. **అబద్ద బోధకుల యేసునామము**
7. **అబద్ద బోధకుల మట్టలాదివారము**
8. **అబద్ద బోధకుల క్రొత్త సంవత్సరము జనవరి 1**
9. **అబద్ద బోధకుల వాచ్‌నైట్ సర్వీస్ డిశెంబర్ 31**
10. **అబద్ద బోధకుల పెండ్లి కాని పరిచర్యలు**
11. **అబద్ద బోధకుల అపవిత్రనామములు**
12. **అబద్ద బోధకుల బాప్తీస్మములు**
13. **అబద్ద బోధకుల వాక్యంలో లేని దినములు**
14. **అబద్ద బోధకుల సంస్థలు-సంఘాలు**
15. **అబద్ద బోధకుల బైబిలు సొసైటీ-1**
16. **అబద్ద బోధకుల త్రిత్వం-దిత్వం 1,2**
17. **అబద్ద బోధకుల వితర్కవాదములు**
18. **అబద్ద బోధకుల గుణలక్షణములు**
19. **అబద్ద బోధకుల యహ్వె/య:వ: నామములు**
20. **అబద్ద బోధకుల పెంతెకోస్తు సీవాన్ 6**
21. **అబద్ద బోధకుల తెలుగు, ఇంగ్లిష్, గ్రీకు బైబిల్స్**
22. **అబద్ద బోధకుల లూనార్ షబ్బాత్**
23. **అబద్ద బోధకుల వాక్యంలోలేని పండుగలు**
24. **అబద్ద బోధకుల బైబిల్స్ మరియు తప్పుడు తర్జుమాలు**
25. **అబద్ద బోధకుల ఆశ్రమాలు, నాయకత్వం**
26. **అబద్దబోధకులైన స్త్రీలు**
27. **అంత్యకాలంలో అబద్ద బోధకులు ఎవరు?**
28. **ఎవడీ జయశాలి ప్రకటన 6:2?**
29. **సర్వజనులకు ఒక్కడే పరమాత్ముడు**
30. **బాప్తీస్మం అంటే ఏమిటి? ఏ నామంలో పొందాలి?**
31. **ఎవరీ రెవరెండ్లు?**
32. **ఆయన నిజమైన పేరేమో నీకు తెలియునా?**
33. **క్రైస్తవ సంస్థలు - యషువ మెస్సీయ సమాజము**
34. **అపోస్తలులు యూదులా లేక క్రైస్తవులా?**
35. **నిజమైన షబ్బాతీయుని నియమ నియామక కాలములు**
36. **యషువ మెస్సీయ సమాజములో నిజమైన సేవకులు ఎవరు?**
37. **యేసు నామము వారి మోసం**
38. **గల్ఫ్ దేశములో క్రైస్తవుల స్థితి**
39. **యషువ మెస్సీయ నిజమరణపునరుత్థాన దినములు అబీబ్ 14-17**
40. **యషువ మెస్సీయ జన్మదినము ఏతానీమ్ 15**
41. **మీసములు-గడ్డములు తీసివేయుట బోధకులకు తగునా?**
42. **ఆది అపోస్తలులకు యేసు క్రీస్తు నామము తెలుసా?**
43. **బైబిలు పండుగలు**
44. **ఆది అపోస్తలులు సమాజము మీకు తెలుసా?**
45. **యేసునామము వారలారా! మీరు పొందిన/ఇచ్చుచున్న బాప్తీస్మము వాక్యానుసారమేనా?**
46. **తెలుగు బైబిలు చరిత్ర**
47. **మీరు పొందిన బాప్తీస్మం వాక్యానుసారమేనా?**
48. **మీరు క్రైస్తవులా? అయితే ఇది మీకోసమే**
49. **ఆది అపోస్తలులు-నకిలీ అపోస్తలులు**
50. **ప్రభుదినము ఆదివారమా? శనివారమా?**

## యావె నామము ఉచ్చరించుటలో ఆశీర్వాదము

**అట్లు వారు ఇశ్రాయేలీయుల మీద నా నామమును ఉచ్చరించుట వలన నేను వారిని ఆశీర్వదించెను.**

**సంఖ్యా 6:26**

**దుష్టులు న్యాయమెట్టిదైనది గ్రహింపరు యావెను ఆశ్రయించువారు సమస్తమును గ్రహించుదురు**

***సామెతలు 28:5***

**ఎడిటర్ నోట్**

ప్రియ పాఠకులకు షలోం. పత్రికను ఉచితముగా పొందుచున్నవారు తప్పక సం॥ర చందా రూ. 50/- పంపి పత్రికను పొందవలెను. ఈ పరిచర్య ద్వారా బాప్తీస్మము పొంది సత్యములో నడచుచున్న సహోదరులు తప్పక పత్రిక పరిచర్యకై సహకరించవలెను. దూరముగా ఉన్న సహోదరులు తమ కానుకలను ఆన్‌లైన్ ద్వారా పంపించవచ్చును.

**Isaac E. Kusuma**
Online A/C No. **10664134898**
Bank Code 0885
SBI, Narsapur, W.G.Dt

**Isaac E. Kusuma**
Online A/C No.**ABG 0361-10025001028**
Bank Code 0361
Andhra Bank, Malikipuram

Printed, Published and Owned by Isaac. E. Kusuma and Printed at Ratna Offset, Malikipuram -533 253. E.G. Dt. and Publsihed at Malikipuram Editor Isaac E. Kusuma. All rights reserved